దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్
- అధికారులతో సమావేశం

నిర్మల్అర్బన్: మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 18 : నూతన పరిశ్రమల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. టీఎస్ ఐపాస్ వెబ్ సైట్‌లో నూతన పరిశ్రమల కోసం వచ్చిన దరఖాస్తులు, అనుమతి, తిరస్కరణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నియమాలు పాటించిన వారికి మాత్రమే పరిశ్రమల ఏర్పాటు అవకాశం కల్పించాలన్నారు. అన్ని ధృవపత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. దరఖాస్తులను తిరస్కరించినట్లయితే వాటికి గల కారణాలను దరఖాస్తు ఫారంలో పొందుపర్చాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమ మేనేజర్ నర్సింహ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి రాజేశ్వర్ గౌడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి అభినందన

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 18 : నిర్మల్‌లోని వేదం గ్లోబల్ స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న చిన్నోళ్ల ప్రశస్తిని ఇండియా ఈస్ ఆస్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన భారత దేశపు ప్రీమియర్ క్రియేటివిటి నేషనల్ అండ్ ఇంటర్ స్కూల్ పెయింటింగ్, రైటింగ్ పోటీల్లో భాగంగా పవిత్ర స్వేచ్ఛ అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థిని ప్రశస్తిని జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలవడం గర్వించదగిన విషయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఘనతలు సాధించాలన్నారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థినిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

జైనథ్, అక్టోబర్ 18 : సాంగ్వి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను మండల విద్యాధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సామర్థ్యాలు పెంచే విధంగా విద్య బోధన చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారంగా అమలు పర్చాలన్నారు. అనంతరం హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీలో సీనియర్ నాయకులకు స్థానం కల్పించాలి

బోథ్, అక్టోబర్ 18 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీలో పార్టీ కోసం కష్టపడ్డ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ నాయకులని చెప్పుకుంటూ కష్టపడ్డ వారిని విస్మరించి ఇందిరమ్మ కమిటీ జాబితాలో వారికి కావాల్సిన వ్యక్తుల పేర్లను అధిష్టానానికి పంపించడం సిగ్గుచేటన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తల పరిస్థితి ఏమిటని ఆలోచించకుండా తమ స్వార్థం కోసం కండువాలు మార్చుకున్న వ్యక్తుల పేర్లను పంపించడం జరిగిందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తల నాయకుల పేర్లను జాబితాలో చేర్చాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతాయని హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, నియోజకవర్గ సేవాదల్ ఇన్‌చార్జి రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతర

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 18: ఖానాపూర్ మండలం సూర్జాపూర్‌లో శ్రీశ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతర, రథోత్సవం వైభవంగా జరిగింది. గురువారం రాత్రి జాతర ప్రారంభం కాగా శుక్రవారం రథోత్సవం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఊరేగింపుగా రథాన్ని లాగారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురు కాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం

బోథ్, అక్టోబర్ 18 : ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తామని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. శుక్రవారం బోథ్‌లోని కేజీబీవీలో ఇన్‌చార్జి మంత్రి, స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న గోడ నిర్మాణానికి, జడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో రూ.5 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి సన్మానం

బోథ్, అక్టోబర్ 18 : బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో మూడేళ్ల పాటు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న బీ హుస్సేన్‌ను శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే, పీపీ శ్రీధర్, ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు సుభాష్, మోహన్‌రావ్, అంగద్ కేంద్రే, రూపేందర్ సింగ్, హరీశ్, విజయ్, దమ్మపాల్, విక్రమ్, జమీర్, శరణ్య పాల్గొన్నారు.

పత్తికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7521

ఎదులాపురం, అక్టోబర్ 18 : పత్తి పంటకు 2024–25 సంవత్సరంలో కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7521 నిర్ణయించడం జరిగిందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పత్తి తేమ శాతం నిర్ధారణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పత్తిని 8 శాతం తేమ మించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఇంటి వద్ద నుంచి తెచ్చేటప్పుడు పత్తిని ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు రాగానే టోకెన్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి గజనన్, ఐకేపీ, సీసీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయం తనిఖీ

నార్నూర్, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయాన్ని శుక్రవారం సబ్‌కలెక్టర్ యువరాజ్ తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. కార్యాలయ సమస్యలపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, భూ సమస్యలు లేకుండా చూడాలన్నారు. సర్టిఫికెట్ల జారీ జాప్యం జరుగకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి

నార్నూర్, అక్టోబర్ 18 : విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని డివిజన్ పంచాయతీ అధికారి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండలం దాబా(కే) గ్రామ పంచాయతీని సందర్శించారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలు నిత్యం చేపట్టాలన్నారు. మొక్కల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సుభాష్ ఉన్నారు.

పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు

ఇచ్చోడ, అక్టోబర్ 18: సిరికొండ మండలం సాత్‌మోరి, రంజీగూడ గ్రామాల్లోని పాఠశాలల్లో శుక్రవారం మండలాధ్యక్షుడు పాముల గంగారాం ఆధ్వర్యంలో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సుమన్, మండల ప్రధాన సంజీవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో పత్తి పంట ధ్వంసం

నేరడిగొండ, అక్టోబర్ 18 : తేజాపూర్ గ్రామంలో వాంకిడి నర్సింగ్‌రెడ్డికి చెందిన పత్తి పంటపై పందులు దాడి చేసి ధ్వంసం చేశాయి. రెండెకరాల పత్తి పంట నేలమట్టం కావడంతో జరిగిన నష్టానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు ప్రభుత్వాన్ని కోరారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT: KARIMNAGAR
ARB.No. 32 of 2024
Between:-
M/s. Margadarsi Chit Fund Private Limited, Ramagundam. ...Disputant
AND
PULI CHAITANYA SRAVANTHI & Others ...Opponents
NOTICE
To,
O-6. ATHRAJ RAJU, S/o. RAJANNA, H.No. 2-158, Vill: Chinthalbori, Mdl: Bhainsa, Dist: Niramal.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money. In the past you have been issued summon, but you have failed to receive the same. The above Dispute is posted on **22-11-2024** for your appearance. On that day you have to appear in person at 10:30 am before The Deputy Registrar referred above. Other-wise the case will be decided ex-parte.
Sd/- **DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, KARIMNAGAR.**

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కుంటాల: సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల, అక్టోబర్ 18 : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిటుబాటు ధర కల్పించే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం కుంటాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటాల్‌కు రూ. 4,892 మద్దతు ధర ఉందని 12 శాతం తేమతో తమ పంటను తీసుకువచ్చి అమ్మాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గంగాచరణ్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, మాజీ ఎంపీపీ గజ్జారాం, నాయకులు జీవీ రమణ రావు, వెంగల్ రావు, సారంగాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మహిపాల్, సాయికిరణ్, జక్కుల గజేందర్, తాటి శివ, మాజీ సర్పంచ్ మహేందర్, అశోక్, నరేశ్ పటేల్, మాజీ ఎంపీటీసీ సుధాకర్, శేఖర్ రావు, శరత్‌గౌడ్, సుదర్శన్ పటేల్, ఎంపీటీసీలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

బాసర, అక్టోబర్ 18 : బాసరలోని తహసీల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్ ఆయా గ్రామాలకు చెందిన 63 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పవార్ చంద్ర, డీటీ నసిరొద్దీన్, ఆర్ఐ అభిమన్యు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల విచారణ వాయిదా

నర్సాపూర్ (జీ), అక్టోబర్ 18: మండల కేంద్రానికి చెందిన ముష్కం సత్యమ్మ గౌరవ హైకోర్టు నందు 686 సర్వే నంబర్ స్థలం తనదంటూ గత సంవత్సరం ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం కేసును కొట్టివేసింది. చివరగా డీపీవో విచారణ చేయాలని గౌరవ న్యాయస్థానం ఆదేశించింది. ఆదేశాల మేరకు శుక్రవారం 11 గంటలకు నర్సాపూర్ (జీ) మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో విచారణ చేపడుతున్నట్లు డీపీవో పోతకోటి శ్రీనివాస్ మండల కేంద్రానికి చెందిన సంతోష్ గౌడ్, సుదర్శన్ గౌడ్, రమేశ్ గౌడ్, పీసర లక్ష్మి సత్తమ్మ ఐదుగురికి పంచాయతీ కార్యదర్శి కైలాస్ ద్వారా నోటీసులు అందించారు. జిల్లా పంచాయతీ అధికారి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రభుత్వ పరిపాలనలో బిజీ షెడ్యూల్ ఉండడం చేత శుక్రవారం విచారణ వాయిదా వేస్తున్నట్లు ఎంపీవో తిరుపతి రెడ్డికి ఆదేశాలు పంపారు. తిరిగి వచ్చే వారంలో విచారణ చేపడుతామని ఆదేశాలలో పేర్కొన్నారు. గౌడ కులస్తులు గ్రామ పంచాయతీ ఆవరణలో హాజరై వెనుతిరిగారు. గౌడ కులస్తులకు విచారణ వాయిదా వేస్తున్న ఆదేశాలను పంచాయతీ కార్యదర్శి వారికి అందించారు.

ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల, అక్టోబర్ 18: మండల కేంద్రంలోని అతి పురాతనమైన మహంకాళి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాభివృద్ధి కోసం రూ.25 లక్షల నిధులను త్వరలో మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు దత్తా నిక్కం, బీజేవైఎం మండలాధ్యక్షుడు పోత్‌రాజ్ నవీన్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాము బర్కడే, మండల్ జనరల్ సెక్రటరీ సందీప్‌ఠాక్రే, మాజీ సర్పంచ్ ఇంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాలుర కబడ్డీ ఎంపిక పోటీలు

బేల, అక్టోబర్ 18 : బేల మండలం సిర్సన్న గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అండర్–17 బాలుర జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలను ఎంఈవో కోల నర్సింహులు, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావ్ ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించడంతో క్రీడాకారులకు గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాల నుంచి 100 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. జోనల్ స్థాయికి జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కదం మహాలక్ష్మి, చప్రాల కాంప్లెక్స్ హెచ్ఎం రమేశ్, పంచాయతీ ప్రత్యేకాధికారి సుధారాణి, మాజీ సర్పంచ్ భూమన్న, కిష్టారెడ్డి, పీడీ జ్యోతి, జిల్లాలోని పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

20న ఖోఖో ఎంపిక పోటీలు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 18 :దిలావర్‌పూర్ మండలంలోని లోలం లిటిల్ స్కారల్ హైస్కూల్‌లో ఈ నెల 20వ తేదీన జూనియర్ బాలబాలికల ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు గంద్రత్ ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు, బోనఫైడ్, పదో తరగతి మెమోతో ప్రధానోపాధ్యాయుడు సురేశ్, పీఈటీ రాకేశ్‌కు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వాహనాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపిక

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 18:నిర్మల్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో రిట్రోఫిటెడ్ మోటర్ వాహనాల పంపిణీకి శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ కమిటీ అర్హులైన దివ్యాంగుల ధృవీకరణ పత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డీఆర్డీవో విజయలక్ష్మి, ప్రాంతీయ రవాణా శాఖ అధికారి దుర్గా ప్రసాద్, దివ్యాంగులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

తలమడుగు, అక్టోబర్ 18 : మండలంలో నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. శుక్రవారం దేవాపూర్, కజ్జర్ల, తలమడుగు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది నిర్వహిస్తున్న భూ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన భూ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. భూములకు సంబంధించిన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రోహిదాస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగం కావొద్దు

ఉట్నూర్, అక్టోబర్ 18: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగం కావొద్దని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు కావాలనే ఈ చట్టాన్ని వాడుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నందున అధికారులు నిజానిజాలు పరిశీలించి చట్టం అమలు చేయాలన్నారు. కావున చట్టంపై గ్రామ స్థాయిలో అవగాహన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నగేందర్ గౌడ్, తహసీల్దార్ ప్రవీణ్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

ఎదులాపురం, అక్టోబర్ 18 : ఆదిలాబాద్ రూరల్ మండలానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ నోముల సంతోష్ కాలుకు గాయంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా శుక్రవారం మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రాజేశ్వర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

నర్సాపూర్(జీ), అక్టోబర్ 18 : వెంగ్వాపేట్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్మల్ జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–17 చదరంగం పోటీల్లో నర్సాపూర్(జీ)లోని కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న కడెం ప్రతిభ కనబర్చి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రత్యేక అధికారిణి వీణ, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు నవంబర్‌లో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్, ప్రధానోపాధ్యాయుడు గజ్జారాం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, పీఈటీఏ కార్యదర్శి భోజన్న, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

బోథ్, అక్టోబర్ 18 : పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని డీఈవో ప్రణీత అన్నారు. శుక్రవారం ధన్నూర్(బీ) ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. రికార్డులు, పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీ రమేశ్ ఉన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

రోడ్డుపై ఆరబోసిన సోయా దిగుబడులు

బాసర, అక్టోబర్ 18 : బాసరలో సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. 15 రోజులుగా తాము పండించిన సోయా దిగుబడులను రోడ్లపై ఆరబోసి కాలమెల్ల దీస్తున్నామని, మహారాష్ట్రకు తరలిస్తే అక్కడి మద్దతు ధర లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధరతో సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ మండల కేంద్రంలో కొనుగోలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి బాసరలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రసవాలు పెంచేందుకు కృషి చేయాలి

తలమడుగు, అక్టోబర్ 18: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మరుగుదొడ్లను పరిశీలించారు. మరమ్మతులు, దవాఖానలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఆయన వెంట డాక్టర్ వంశీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేతకాని సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 18 : శ్యాంపూర్ గ్రామంలో నేతకాని సంఘ నాయకులు నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా విజయ్ ,ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, సహాయ కార్యదర్శిగా గోనే మల్లేశ్, సలహాదారుడిగా జాడి మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతకాని జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సయ్య, దూట మహేందర్, గవాస్కర్, ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

ఇంద్రవెల్లి, అక్టోబర్ 18 : అంజీ గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడలో గ్రామస్తులు నిర్మించిన నూతన హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనకు వందలాది మంది ప్రజలు తరలివచ్చారు. నూతన కలశంతో గ్రామస్తులు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. వేదమంత్రోత్సవం మధ్యలో ఆలయ గోపురంపై నూతన కలశం ఏర్పాటు చేసి, ఆలయంలో హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జెండా వద్ద భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపటేల్ పాండ్రే శ్యామ్‌రావ్, పూలాజీబాబా కుమారుడు ఇంగ్లే కేశవ్ రావ్, ఆంధ్ ఆదివాసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు కుడే కైలాస్, జిల్లా అధ్యక్షుడు ముకాడే విష్ణు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

జైనథ్, అక్టోబర్ 18 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జైనథ్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శరత్‌కుమార్ సూచించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు పొచ్చిరాం, షేక్ మూనహిద్, ఉపాధ్యాయురాలు అనసూయ విద్యార్థులతో కలిసి పూల మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయులు వారికి స్వాగతం పలికి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, గంగన్న, పెంటపర్తి ఊశన్న, ఉపాధ్యాయురాలు జ్యోతి, జయశ్రీ పాల్గొన్నారు.

సిరికొండలో కుమ్రం భీం వర్ధంతి

ఇచ్చోడ, అక్టోబర్ 18 : సిరికొండలో శుక్రవారం కుమ్రం భీం వర్ధంతి ఆదివాసులు నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో మండల కేంద్రానికి వచ్చి జెండా పూజ చేసి, కుమ్రం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సార్‌మేడి అమృత్‌రావ్, ఎస్ఐ తిరుపతి, ఏఎస్ఐ రమేశ్, కాంగ్రెస్ నాయకులు ఇమామ్, రఘురాం, పాండు, యాదవ్ రావ్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

ఇంద్రవెల్లి, అక్టోబర్ 18 : కోబ్బయిగూడ గ్రామానికి చెందిన కుమ్రం దుర్పతాబాయి ఇటీవల పాముకాటుతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి పరామర్శించారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 18 : నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి చెస్, కరాటే పోటీల్లో విజయ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణ్ తెలిపారు. చెస్ పోటీల్లో శ్రీ కృతి, పల్లెర్ల గణేశ్, ఏ హిమాని, కరాటేలో నిత్యానందిని ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. వీరు త్వరలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన వీరిని పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సన్మానించారు.

దివ్యాంగులపై దాడులను అరికట్టాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 18 :దివ్యాంగులపై దాడులను అరికట్టాలని తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సట్టి సాయన్న అన్నారు. శుక్రవారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడెం మండలంలో ఓ దివ్యాంగుడిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. పోలీసులు స్పందించి దివ్యాంగులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో క్రాంతి కుమార్, మధుకర్, ఇసాక్ అలీ, నారాగౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కు అందజేత

ముథోల్, అక్టోబర్ 18 : ముథోల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి శుక్రవారం సరస్వతి నగర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మనోహర్‌కు కల్యాణలక్ష్మి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆత్మ స్వరూప్, నాయకులు కాలేవార్ దిగంబర్ పాల్గొన్నారు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 18: ప్రభుత్వం గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీ ప్రకటించిన సందర్భంగా శుక్రవారం ఖానాపూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతక ముందు క్యాంపు కార్యాలయంలో పలువురు గౌడన్నలకు రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి వృత్తి పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, నాయకులు కావలి సంతోష్, దయానంద్, రమేశ్, గంగనర్సయ్య, షబ్బీర్ పాషా, గోవింద్, సత్యం పాల్గొన్నారు.

విధుల్లో చేరిన వ్యవసాయాధికారి మహ్మద్ సొద్

బజార్‌హత్నూర్, అక్టోబర్ 18 : బజార్‌హత్నూర్‌కు మండల వ్యవసాయ శాఖ అధికారిగా మహ్మద్ సొద్ గురువారం విధుల్లో చేరారు. ప్రమోద్ రెడ్డి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కొత్తగా ఉద్యోగంలో చేరారు. స్థానిక రైతులు, ఏఈవోలు శ్రీకాంత్, కృష్ణపాల్, సంధ్య కొత్త వ్యవసాయ అధికారికి స్వాగతం పలికి, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

25న కుమ్రం సూరు వర్ధంతి

ఉట్నూర్, అక్టోబర్ 18: కొలాం వీరుడు కుమ్రం సూరు 27వ వర్ధంతికి సంబంధించిన పోస్టర్‌ను ఉట్నూర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన దంతన్‌పల్లి కొలాంగూడలో 27వ కుమ్రం సూరు వర్ధంతి నిర్వహిస్తున్నందున విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కొలాం నాయకులు వసంత్, రాజు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే లక్ష్యం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

దస్తురాబాద్(కడెం), అక్టోబర్ 18 : సబ్బండ వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, మత్స్యశాఖ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. మత్స్య శాఖ అభివృద్ధి పథకం ద్వారా కడెం ప్రాజెక్టులో శుక్రవారం అధికారులు, నాయకులతో కలిసి వారు చేప పిల్లలను విడుదల చేశారు.అనంతరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

ఎదులాపురం, అక్టోబర్ 18: గంజాయిని విక్రయిస్తున్న ఒకరితో పాటు కొనుగోలు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఇంద్రవెల్లి మండలానికి చెందిన కర్తార్ సింగ్ 70 గ్రాముల గంజాయిని ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీకి చెందిన రాజేశ్వర్, కైలాస్ నగర్‌కు చెందిన సయ్యద్ సమీర్‌కు శుక్రవారం బాలాజీ నగర్ వద్ద విక్రయిస్తుండగా ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఎదులాపురం, అక్టోబర్ 18 : ఇంద్రనగర్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది దాడి చేసి నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి రూ.10,570 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాట స్థావరంపై దాడి చేసిన వారిలో పోలీస్ సిబ్బంది రమేశ్, క్రాంతి, ప్రవీణ్, గోపాల్ ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

ఎదులాపురం, అక్టోబర్ 18 : ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మావల ఎస్ఐ విష్ణు వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం..గుడిహత్నూర్ మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన కొడప మానిక్‌రావ్(41)కు కొలాంగూడకు చెందిన సంగీతతో వివాహం జరిగింది. కొంతకాలం క్రితం భార్య వెళ్లిపోవడంతో పిల్లలతో కలిసి ఉంటున్నాడు. నోటి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. అయితే ఈ నెల 13న దసరా రోజు ఇంటి నుంచి వెళ్లిపోయిన మానిక్‌రావ్ గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం మేకల కాపరి కృష్ణ గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

చౌదరపు హరికృష్ణ(ఫైల్)

తాంసి, అక్టోబర్ 18 : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మత్తడి వాగు ప్రాజెక్టు సమీపంలో ఆదిలాబాద్ జిల్లా శాంతినగర్ కాలనీకి చెందిన చౌదరపు హరికృష్ణ(27) మతిస్థిమితం లేక తిరుగుతుండగా ఈ క్రమంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి చౌదరపు అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాం తెలిపారు.

కుంటాల, అక్టోబర్ 18 : మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం కుంటాల మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన డొంగ్రే సచిన్(29) ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో మద్యానికి బానిసయ్యాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన స్లాబ్ ఇంటికి నైలాన్ తాడుతో ఉరివేసుకున్నాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాందాస్ తెలిపారు.

వేర్వరు ప్రదేశాల్లో చోరీ

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 18 : నిర్మల్‌లో గురువారం రాత్రి రెండు వేర్వేరు ప్రదేశాల్లో దొంగతనం జరిగినట్లు పట్టణ ఎస్ఐ అశోక్ తెలిపారు. బంగల్‌పేట్ కాలనీకి చెందిన ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంట్లోకి దుండగులు ప్రవేశించి బీరువాలోని 8 గ్రాముల బంగారం, 10 తులాల వెండి, రూ.20వేల నగదును అపహరించుకుని పోయారు. అలాగే పాత బస్టాండ్ ప్రాంతంలోని నిర్మల్ ఇంజినీరింగ్ అండ్ ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ జరిగింది. షటర్ లోనికి దొంగలు ప్రవేశించారు. దుకాణం నుంచి ఏమి ఎత్తుకుపోలేదని పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భైంసాటౌన్, అక్టోబర్ 18 : భైంసా పట్టణం భట్టిగల్లికి చెందిన వాస్టర్ సాయినాథ్ (35) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సాయినాథ్ బొలెరో వాహనంలో ఎరువుల బస్తాలను వేసుకొని వాహనాన్ని నడుపుకుంటు భైంసా నుంచి బాసర వైపు వెళ్తుండగా దేగాం వద్ద బ్రిడ్జికి ఢీ కొట్టాడు, ఈ ప్రమాదంలో సాయినాథ్ అక్కిడికక్కడే మృతి చెందాడు. మృతినికి పెళ్లి అయ్యి విడాకులు అయ్యాయి. మృతిని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర కిలో గంజాయి పట్టివేత

తానూర్, అక్టోబర్ 18 : మండలంలోని బెల్‌తరోడ చెక్‌పోస్టు వద్ద అరకిలో గంజాయి పట్టుకున్నట్లు ముథోల్ సీఐ మల్లేశ్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి నిర్మల్‌కు చెందిన సుధాకర్, దీపక్ సింగ్ మహారాష్ట్ర నుంచి అరకిలో గంజాయి తీసుకుని కాలినడకన బెల్‌తరోడ చెక్‌పోస్టు వచ్చే క్రమంలో చెక్‌పోస్టు వద్ద పోలీసులు అనుమానం వచ్చి తనిఖీ చేయగా పట్టు పడ్డారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.